క్లుప్తంగా

నేడు ఉచిత సంతాన సాఫల్య శిబిరం

కందుకూరు: ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కందుకూరు లయన్స్‌క్లబ్, బూన్ ఐవీఎఫ్ సంతాన సాఫల్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ఉచిత సంతాన సాఫల్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మేరకు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.విఠల్‌రెడ్డి, కోశాధికారి కె.వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ శ్రావ్య తాల్లపురెడ్డి ఆధ్వర్యంలో స్థానిక భూలక్ష్మి మెమోరియల్ ఆస్పత్రిలో శిబిరాన్ని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పిల్లలు లేని దంపతులకు నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించనున్నారని, ప్రాథమిక, ద్వితీయ సంతాన లేమి కారణాలు తెలుసుకుని చికిత్స విశిష్టత, సౌలభ్యం, విధానాలు తెలియజేస్తారని వివరించారు. పిల్లలు లేని దంపతులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరో నిర్వాహకుడు డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు.

మోడల్ స్కూల్‌లో 'శిక్షా సప్తాహ్'



సాంస్కృతిక ప్రదర్శన చేసిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ధనుంజయ్

మహేశ్వరం: మండల కేంద్రంలో ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. దేశభక్తి, భిన్నత్వంలో ఏకత్వం, తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, గిరిజన సంస్కృతుల ప్రాధాన్యతను విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో కళ్లకు కట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెహానా, మాధవి, కృష్ణవేణి, నర్సింహ, అనిల్, తేజ, సాయి, అజ్గర్, శ్యామ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

మహేశ్వరం: మండలంలోని పని చేస్తున్న 13 మంది సీనియర్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారని ఎంపీడీఓ శైలజ, ఎంపీఓ రవీందర్‌రెడ్డి గురువారం పేర్కొన్నారు. మహేశ్వరం, తుమ్మలూరు, దుబ్బచర్ల, నందుపల్లి, ఉప్పుగడ్డతండా, పెండ్యాల, రామచంద్రగూడ, హబీబుల్లాగూడ, తూప్రకుర్దు, పడమటి తండా, సరిగిరిపురం, మాణిక్యమ్మగూడ, ఘట్టుపల్లి గ్రామాల కార్యదర్శులు బదిలీపై వెళ్లారు. వీరి స్థానంలో 10 మంది కార్యదర్శులు విధుల్లో చేరారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చూడండి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు గురువారం కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కలిసిన వారిలో నాయకులు బేర బాలకిషన్, డివిజన్ పార్టీ అధ్యక్షులు బోయిని శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా మొక్కలు నాటాలి

కార్పొరేటర్ మాధవి



కాలనీలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మాధవి

మీర్‌పేట: ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కను నాటి సంరక్షించాలని మీర్‌పేట కార్పొరేషన్ 45వ డివిజన్ కార్పొరేటర్ అక్కి మాధవి కోరారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం డివిజన్ పరిధిలోని కాలనీల్లో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ.. గతంలో నాటిన మొక్కలు ప్రస్తుతం పెద్దవై పచ్చదనం పెంపొందిందని అన్నారు. రోజు రోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని నియంత్రించాలన్నా, సకాలంలో వర్షాలు పడాలన్నా అధిక సంఖ్యలో చెట్లను పెంచాలని తెలిపారు. అనంతరం ఇంటింటికి వెళ్లి పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ఎల్‌బీనగర్: దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని బీఎస్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు జపనీస్ ఎన్సెఫాలిటీస్(జేఈ) వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు వారికి ఈ టీకాను వేసుకోవాలని సూచించారు.



హుడాకాంప్లెక్స్ పార్కు పక్కనే పేరుకుపోయిన చెత్త కుప్పలు

అడుగేస్తే గుంత.. ఆదమరిస్తే చింత!



గుంతమయంగా మారిన పోచమ్మ బాగ్ వెళ్లే దారి

- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- రోడ్డుపై వర్షపునీరు నిలిచి తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

హుడాకాంప్లెక్స్: అడుగడుగునా తవ్వి వదిలేసిన రోడ్లు.. అందులో నిలిచిన వర్షపు నీటితో నిత్యం జనాలు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలు మరమ్మతులకు నోచుకోక తరచూ ప్రమాదాలు సంభవిస్తున్న ఉదంతాలు సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో నిత్యకృత్యమయ్యాయి. సీసీ రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో ఆయా చోట్ల గోతులు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేద, బడుగు బలహీన వర్గాలు నివసించే అంబేడ్కర్‌నగర్, భగత్ సింగ్‌నగర్, సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం పక్కనే ఉన్న పోచమ్మబాగ్ కాలనీ ప్రధాన రహదారి తదితర ప్రాంతాల్లోని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లను అడ్డంగా తవ్వి వదిలేయడంతో పాదచారులు, వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అంతేకాకుండా పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడ పడితే అక్కడే చెత్తను పడేయడంతో పరిసరాలు దుర్గంధంతో నిండిపోయాయి.



వెంకటేశ్వర కాలనీలో నిలిచిన వర్షపునీరు

భీతిల్లుతున్న వాహనదారులు

వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం గతంలో రోడ్లను తవ్వారు. కానీ వాటిని శాశ్వతంగా పూడ్చకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతోంది. గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. సాధారణంగా డ్రైనేజీ, వాటర్ పైపులైన్లను ఆధునీకరణ సమయాల్లో సీసీ రోడ్ల కోసం తవ్వి పనులు పూర్తి కాగానే కాంట్రాక్టర్లు మట్టిని మాత్రం నింపి ప్యాచ్‌వర్క్ చేయకుండా వదిలేస్తున్నారు. గుంతలుగా ఉన్న రోడ్లపై తిరగడంతో వాహనాలు పాడైపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లపై వరదనీరు నిండడంతో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్ల దుస్థితిపై జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయా కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని కోరుతున్నారు.

రోడ్డుపై మురుగునీరు

చెరుకుతోట కాలనీ ప్రభుత్వ పాఠశాల ముందు డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగి మురుగునీరు రోడ్డుపై పారుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పోచమ్మబాగ్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పైపులైన్ కోసం రోడ్డును తవ్వి పైపులైన్ వేసి మట్టిని పూడ్చారు. పనులు చేపట్టి ఏడాది అవుతున్నా కాంట్రాక్టర్ మరమ్మతులు ఇంకా చేయలేదు.

– జహీర్, వార్డు కమిటీ సభ్యుడు, సరూర్‌నగర్

మరమ్మతులు చేపడతాం

రోడ్డు మరమ్మతులు చేపట్టాలన్నా కనీసం చిన్న చిన్న పనులు చేయాలన్నా నిధులు లేవు. భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పనుల కోసం అప్పట్లో కాంట్రాక్టర్లు రోడ్డును తవ్వి వదిలేశారు. నిబంధనల ప్రకారం సదరు కాంట్రాక్టర్లే మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. స్కూల్ పిల్లల కోసమైనా వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపడతాం.

– ప్రశాంతి, ఏఈ ఇంజనీరింగ్, సరూర్‌నగర్

మట్టి రోడ్లు.. విద్యార్థుల పాట్లు

- రెండు ప్రధాన విద్యా సంస్థలకు రహదారి సమస్య
- పట్టించుకోని పాలకులు, అధికారులు

కందుకూరు: రహదారి సమస్యలతో రెండు ప్రధాన విద్యా సంస్థలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో బురదలోనే తరగతులకు హాజరుకావాల్సిన దుస్థితి నెలకొంది. అయినా సంబంధిత అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకున్న పాపాన పోలేదు. ఇది మండలంలోని నేదునూరు మోడల్ స్కూల్, కొత్తగూడ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్య.

చిత్తడిగా మారిన దారులు

కొత్తగూడ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చి చదువుతున్నారు. అక్కడికి చేరుకోవాలంటే మండల కేంద్రంలోని శ్రీశైలం రహదారి నుంచి రాకపోకలు సాగించాలి. దాదాపుగా కిలోమీటర్‌కు పైగానే దారి ఉంటుంది. కాగా శ్రీశైలం రహదారి నుంచి కళాశాల వరకు మట్టి దారే ఉంది. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో బురదమయమై విద్యార్థులు నానా అగచాట్లు పడుతున్నారు. రహదారి నిర్మించాలని ఎన్నో పర్యాయాలు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చినా ఫలితం లేదు.

అర కిలోమీటరు మేర

నేదునూరు–బాచుపల్లి రహదారి నుంచి నేదునూరు పరిధిలోని మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ పాఠశాలలకు వెళ్లే మార్గం దాదాపుగా అర కిలోమీటరు మేర ఉంటుంది. అది కూడా మట్టి రోడ్డే. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చిత్తడిగా మారి కాలు తీసి కాలు పెట్టలేని విధంగా మారింది. నిత్యం ఆ మార్గం నుంచి రాకపోకలు సాగించాలంటే విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి రెండు ప్రధాన విద్యా సంస్థలకు వెళ్లే రహదారులను నిర్మించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాలలకు రహదారి సౌకర్యం కల్పించండి

మండలంలోని నేదునూరు మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లేలా రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఊటు మహేందర్ గురువారం జిల్లా కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆ స్కూళ్ల వరకు వెళ్లే మార్గం పూర్తిగా చిత్తడిగా మారి విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. రహదారి సమస్య పరిష్కరించడంతో పాటు అన్ని గ్రామాలకు విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఆయన వెంట విద్యార్థి నాయకులు విష్ణు, రమేష్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



కొత్తగూడ జూనియర్ కళాశాలకు వెళ్లే మార్గంలో నడవడానికి తిప్పలు పడుతున్న విద్యార్థులు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ప్రారంభమైన బొడ్రాయి పండగ

మహేశ్వరం: మామిడిపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. ప్రతి ఇంటి వద్ద బిందెలతో సాక పెట్టి, మంగళహారతి పట్టారు. కొబ్బరికాయ, పూలు, పసుపు, కుంకుమ సమర్పించారు. నాలుగు రోజుల కార్యక్రమంలో ప్రధాన ఘట్టమైన విగ్రహ ప్రతిష్ఠాపన శనివారం జరగనుంది. చండీ ఉపాసకులు బ్రహ్మశ్రీ రేవల్లి రాజు శర్మ నేతృత్వంలో పురోహితులు మాడుగుల శ్రీనివాస శర్మ, రామ చైతన్య శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేటర్లు సుక్క శివకుమార్, యాతం పవన్ కుమార్ యాదవ్‌ల పర్యవేక్షణలో వేడుకలు కొనసాగుతున్నాయి.



పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

వర్షం తెచ్చిన తంటా

తుక్కుగూడ: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తుక్కుగూడ మున్సిపాలిటీ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల నుంచి తుక్కుగూడకు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ నంబరు–14 వద్ద వర్షపు నీరు నిలవడంతో శ్రీశైలం జాతీయ రహదారి, సర్వీసు రోడ్డులో ప్రయాణం చేసే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఓఆర్‌ఆర్ సర్వీసు రోడ్డుపై నిలిచిన నీరు

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు – టమాట రూ.39, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.45, కాకర రూ.35, బీర రూ.35, క్యాబేజీ రూ.20, ఫ్రెంచిబీన్స్ రూ.70, క్యారెట్ రూ.42, దొండ రూ.28–30, చిక్కుడు రూ.65, గోకర రూ.35, బీట్‌రూట్ రూ.32, క్యాప్సికం రూ.47, ఆలు రూ.40, దోస రూ.18, సొర రూ.09, పొట్ల రూ.13, ఉల్లిగడ్డ రూ.39, చామగడ్డ రూ.40గా ఉన్నాయి.

ఘనంగా బోనాల ఉత్సవాలు

బడంగ్‌పేట్: బోనాల సంబరాలు బాలాపూర్, బడంగ్‌పేట, దావుత్‌ఖాన్‌గూడలో గురువారం ఘనంగా నిర్వహించారు. బాలాపూర్‌లోని నల్ల పోచమ్మ, పోచమ్మ, ఎర్ర మైసమ్మ అమ్మవార్లకు బోనాలతో భక్తులు డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగించారు. బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి బోనం ఎత్తుకుని నల్లపోచమ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. బడంగ్‌పేటలోని దావుత్‌ఖాన్‌గూడలో దళితుల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ పాల్గొన్నారు. మైసమ్మ ఆశీస్సులు తీసుకుని వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు.



బడంగ్‌పేటలో అమ్మవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్

భట్టి పద్దుపై స్పందించిన ప్రజాగళం

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ఆర్థికశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం శాసనసభలో ప్రవేశ పెట్టారు. మొత్తం రూ.2.91 లక్షల కోట్లతో రూపొందించిన పద్దుపై అధికార, విపక్ష పార్టీలు స్పందించాయి. మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా రంగాల్లో ప్రముఖులు, రాజకీయ నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.


సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

హుడాకాంప్లెక్స్: రాష్ట్ర చరిత్రలోనే మొట్ట మొదటిసారి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్‌లో రూ.325 కోట్లు కేటాయించినందుకు జిల్లా ఒలింపిక్ సంఘం, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, క్రీడాకారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియంలో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.



క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం శుభ పరిణామమని కొనియాడారు.


బీసీల అభివృద్ధికి పెద్దపీట



తుక్కుగూడ: రాష్ట్రంలో బీసీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.9,200 కోట్లను కేటాయించింది. గతంలో ఏ ప్రభుత్వం కూడా బీసీల అభివృద్ధికి ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించ లేదు. నిధులు కేటాయింపు హర్షనీయం.

– ధనంజయ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు

కందుకూరు వరకు మెట్రో..



తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో మెట్రో రైలు విస్తరణ అంశం పాత బస్తీ నుంచి శంషాబాద్ వరకు ప్రకటించింది. గత ప్రభుత్వం కందుకూరు వరకు విస్తరణకు హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కందుకూరు వరకు మెట్రో రైలు పనులు చేపట్టాలి.

– వై.శివకుమార్, బీజేపీ ఫ్లోర్ లీడర్, తుక్కుగూడ

విద్యా రంగానికి తీవ్ర అన్యాయం

తుక్కుగూడ: విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి, కార్యదర్శి టి.నాగరాజులు ఆరోపించారు. వారు బడ్జెట్‌పై స్పందించారు. గత ప్రభుత్వం కంటే తక్కువ నిధులను విద్యా రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. కేవలం 7.3 శాతం రూ.21,292 కోట్ల నిధులతో విద్యారంగం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. యూనివర్సిటీల అభివృద్ధికి నిధులు శూన్యమన్నారు. సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనకు పిలుపునిస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

నాగోలు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్నేహపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అనంతుల సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కొత్తపేట డివిజన్‌లోని స్నేహపురికాలనీ, న్యూనాగోలు కాలనీలో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ ఆధ్వర్యంలో డెంగీ, మలేరియా వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీవాసులు చెత్తా చెదారం బహిరంగ ప్రదేశాలలో వేయకుండా స్వచ్ఛ ఆటోలలో మాత్రమే వేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో డీవీ రామారావు, సుధాకర్‌రెడ్డి, రమచందర్, ఉమాదేవి, ప్రసాద్, జంబులయ్య, జీహెచ్‌ఎంసీ, మలేరియా సిబ్బంది సుదర్శన్, చిరంజీవి, వెంకటేష్, శానిటేషన్ సూపర్‌వైజర్ శివ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కొత్తపేట డివిజన్ పరిధిలో గతంలో వేసి రోడ్లు వర్షాలకు ధ్వంసమయ్యాయని డ్రైనేజీ లైన్ కోసం గుంతలు తీసి మరమ్మతులు చేయలేదన్నారు. రోడ్లన్నీ బురదగా మారాయని వెంటనే నూతన సీసీ రోడ్ల నిర్మాణాలను చొరవ చూపాలని వినతిలో కోరారు. అనంతరం ఆర్టీసీ కాలనీలో పర్యటించి డ్రైనేజీ లైన్ పనులను పరిశీలించారు. కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని జలమండలి డీజీఎం రవీందర్ శర్మకు సూచించారు. కాలనీలో విద్యుత్ దీపాలు, శానిటేషన్, మంచి నీటి సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట జలమండలి ఇన్‌చార్జి ఆరీఫ్, దయాకర్, కాలనీ అధ్యక్షులు పెంటరెడ్డి ఉన్నారు.